ఆరేళ్ళతర్వాత
భర్త తనను
చేరదీస్తున్నాడనే
వార్త ఆమెను
ఆనందపరచిందా?

# ఉత్తరం

కాకాని
కమల
కథ

మధ్యాహ్నం పన్నెండు గంటలు దాటుతూంది.

ఆ రోజు సెకండ్ సాటరడే కావటంతో ఆఫీసుకి శెలవు.

భోజనం చేసి విశ్రాంతిగా మంచంలో వారి పత్రిక చదువుకుంటూంది సబిత.

ఇంతలో 'పోస్ట్' అన్న చిన్న కేక, కిటికి రెక్క చప్పుడు వినపడటంతో గభాల్న లేచి వసారాలోకి వచ్చింది.

కిందపడ్డ ఉత్తరాన్ని చేతిలోకి తీసుకుంది. చేతివ్రాత చూస్తూనే గుర్తుపట్టింది. ఉత్తరం తండ్రి దగ్గర్నుంచి.

కాని ఆమె కళ్ళు కాస్త ఆశ్చర్యంతో విచ్చుకున్నాయ్.

"నాన్న దగ్గర్నుంచి ఉత్తరం వచ్చి నిండా వారం రోజులు కూడా కాలేదు. ఇంకా తను జవాబు రాయనేలేదు. మళ్ళీ ఇంతలో ఈ ఉత్తరం ఏమిటి? ఏమన్నా సీరియస్ కాదు కదా?" అనుకుంటు కవరు విప్పింది.

"చి. సబితకి,

మీ నాన్న దీవించి వ్రాయునది. నీకు శుభవార్త తల్లి. ఇన్నాళ్ళకి నీకు మంచి రోజులు వచ్చాయి. దేముడు నిన్ను కరుణించాడు.

నాలుగు రోజుల క్రితం వల్లభరాయపాలెం నుంచి మీ అత్తగారూ మామగారూ మా ఇంటికి వచ్చారు. మా కళ్ళని మేం నమ్మలేకపోయ్యామనుకో. అంతేకాదు... బుట్టనిండా అరిసెలు, చక్కినాలు, నీకు చీర జాకెట్టు ఏవేవో తెచ్చారు.

సుమారు ఆరు సంవత్సరాల తరువాత వాళ్ళని చూడటంతో ముందు మీ అమ్మ



అంది.

అమ్మా సవిత! ఇంతకీ అసలు విషయం ఏమిటంటే అల్లుడు వల్లభరాయుపాలెంలో పెట్టిన కోళ్ళఫారం, డైరి సరిగ్గా నడవటం లేదుట. చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయట. ఖర్చులు ఎక్కువ రాబడి తక్కువగా వుందట. అందుకని వాటిని ఎవరికైనా అమ్మేసి ఆ డబ్బుతో పట్నంలో ఏవన్నా వ్యాపారం చేసుకుందామనుకుంటున్నాడట.

మీ మావగారూ బాగా వృద్ధుడు అయిపోయ్యాడు. స్వంత వ్యవసాయం చేసుకోలేక పోతున్నాడట. వాళ్ళు కొడుకుతోపాటు పట్నం వస్తారనుకుంటాను. ఏవో అప్పులున్నా

నేను గుర్తించలేకపోయ్యాం.

ఇంతకీ అసలు విషయం ఏమిటంటే— "మా కోడలేది. మా కోడల్ని మా ఇంటికి తీసుకు వెడతాం" అంది మీ అత్తగారు.

"జరిగిపోయిందేదో జరిగిపోయింది. పారపాట్లు ఎవరివైనా పంతాలు పట్టింపులకిపోయి బంధుత్వాలు తెంచుకోనవసరం లేదు. ఆరు సంవత్సరాల నుంచి భార్యభర్తలు విడిపోయ్యారు. తప్పు పోనీ మాదే అనుకోండి. ఆ తప్పుని సవరించుకొని మా అబ్బాయి సంసారం పచ్చగా వుండాలని మా కోడలు నట్టింట్లో తిరగాలని ఈ ముసలి వయసులో ఆశపడుతున్నాం.

యని పొలం అమ్మి తీరుస్తారని వాళ్ళ మాటల వల్ల అర్థం అయింది. లోతుగా తరచి అడగటం బాగుండదని నేను మీ అమ్మ తర్కించలేదు.

ఏది ఏమయినా ఇన్నాళ్ళకి దేముడు నిన్ను కరుణించాడు. పెళ్ళంటే వెయ్యేళ్ళ పంట. తెంచుకుంటే తెగే బంధం కాదు కదా. కాస్త ఆలస్యంగానైన నీ సంసారం చక్కబడుతున్నందుకు మాకు ఆనందంగా ఉంది. మీ అమ్మ చిన్న పిల్లలా తెగ సంబరపడిపోతూంది. చిన్నటిదాకా కీళ్ళ నొప్పులు గుండెదడ అంటు మంచం దిగని మనిషి ఇల్లంతా బొంగరంలా తిరుగుతూంది. అప్పుడే వాడకట్టు అంతా చెప్పి వచ్చింది—

ఈ నెల ఇరవై నాలుగు తారీఖు దాకా మూఢం. ఆ తరువాత మంచి రోజు చూసుకొని నిన్ను తీసుకు వచ్చి దింపమని మీ అత్త మరీ మరీ చెప్పింది. అందుకని నువ్వు ఓ వారం రోజులు శెలవు అప్లయి చేసుకో. నేను మళ్ళ ఉత్తరం రాస్తాను. అసలు ఈలోగా మీ ఆయనే నీ దగ్గరకి వస్తాడేమో. అతనితో సఖ్యతగా ఉండు. గతం నాస్తిః అనుకుంటే అందరికి మంచిది. నువ్వు పిల్లా పాపలతో పచ్చగా వుండాలనే మా కోరిక. కాదనకు. ఇక్కడకి ఎప్పుడు వచ్చేది వ్రాయి.

ఇట్లు
మీ నాన్న
శరభయ్య—''

ముఖంలోకి నెత్తురు చిమ్ముతుంటే రోషంగా ఉత్తరాన్ని వుండగా నలిపి బల్లమీదికి విసిరింది సవిత!

ఆరు సంవత్సరాల తరువాత విడిపోయిన బంధుత్వాలు జ్ఞాపకం చేసుకుంటు తన అత్తగారు తమ ఇంటికి వచ్చిందా? ఏ ముఖం పెట్టుకొని వచ్చింది?

కుండపోత వాన కురుస్తుంటే తన జుత్తు పట్టుకొని బయటికిలోసి తలుపులు మూసింది. ఆవిడ కూతురు నల్లగా వుంటుందని తను తెల్లగా వుందని అస్తమానం తనని అహంకారి అందం చూసుకొని మిడిసిపాటు అని ఎత్తిపొడిచేది. కిటికీలోంచి పక్కింటి కుర్రాణ్ని చూశానని, పూలవాడితో విరగబడి మాట్లాడానని కొడుకు రాగానే ఏవేవో కల్పించి చెప్పేది. ''ఆ ఎర్రతోలు చూసుకు నేరా దాని అహంకారం. ఆ అందం అడుక్కునేలా చేస్తేగాని దాని రోగం కుదరదు'' అనేది

''చూడరా అబ్బాయి. నీకు వ్యాపారంలో వెసులుబాటులేక పుట్టింటికెళ్ళి పదివేలు అప్పుగా తెమ్మంటే ఎదురు జవాబు చెప్తూంది. దానికసలు నువ్వంటే లక్ష్యం లేదురా?'' అంటు కొడుకు చేత కొట్టించేది.

ఇంటెడు చాకిరి చేయించేవారు. కడుపు నిండా తిండి పెట్టేవారు కాదు. తన చీరలు నగలు అన్నీ ఆడబడుచు అలంకరించుకునేది. పైగా మగవాడంటే పడి చచ్చిపోతున్నానని అసహ్యంగా మాట్లాడేవారు.

అప్పటికే తనకి నాలుగవ నెల. అర్జంటుగా పదివేలు కావాలని తెమ్మని తనని పుట్టింటికి తరిమేశారు. పైగా ''మీ కోడలు శీలవతి కాదు. రోగాల పుట్ట. మా వాడికి

మళ్ళీ పెళ్ళి చేస్తాం'' అని ప్రచారం చేసింది తన అత్త.

ఒప్పుకున్న కట్నం కాక ఇంకా అదనంగా తన తండ్రి వాళ్ళకి చాలా ముట్టచెప్పాడు. ఆర్థికంగా ఆయన బాగా చితికిపోయాడు. అందుకే తను పదివేలు ఇవ్వటానికి వీల్లేదని తండ్రికి నిక్కచ్చిగా చెప్పింది. తిరిగి అత్తింటికి వెళ్ళలేదు. కారణం తన ఆరోగ్యం పూర్తిగా క్షీణించిపోయింది. నెల తప్పిన దగ్గర్నుంచి ఒంటికి నీరు పట్టటం, కీళ్ళ నొప్పులు మొదలయ్యాయి.

అలాగే నెల్లు నిండి తనకి పురుడు వచ్చింది. కూతురు పుట్టింది. తను ప్రసవ సమయంలో చచ్చి బతికింది. కాని పుట్టిన బిడ్డ వారం రోజులు పెరిగి మరణించింది. తన అత్తింటివారుగాని భర్తగాని కనీసం చూడటానికి రాలేదు.

అమ్మ తన సంసారం గురించి బెంగ పెట్టుకుంది. కాని తనకి మాత్రం ఎందుకో విరక్తి పుట్టింది. పెళ్ళి పేరుతో ఆగిపోయిన చదువు పూర్తి చేసి చాలా కష్టపడి కొన్ని కాంపిటేటివ్ పరీక్షలు రాసింది. ఆఖరికి సర్వీసు కమీషన్ పరీక్షలో నెగ్గి రైల్వేలో ఉద్యోగం సంపాదించుకుంది. రెండు సంవత్సరాల నుంచి హాయిగా బతుకుతూంది. తనకసలు పెళ్ళి జరిగిందన్న విషయాన్నే మర్చిపోవటానికి ప్రయత్నిస్తూంది. ఏది ఏమైనా సరే... తన జీవితాంతం ఒంటరిగానే వుండాలి. ఉద్యోగంలో ఉన్నత శిఖరాల్ని అందుకోవాలి అన్నదే తన ధ్యేయం. తనకి ఇంకా చాలా వయసు వుంది. ఐయ్యేఎస్‌కి ప్రిపేర్ అవుతూంది. వస్తుందన్న నమ్మకం లేకపోయినా రావాలన్న ఆశ!

ఇలాంటి సమయంలో ఇన్నాళ్ళ తర్వాత వాళ్ళకి తను కావల్సి వచ్చిందా? ఊహూ... వాళ్ళకి కావలసింది కోడలు కాదు. ముసలి వయసులో ఆధారం. కొడుకు వ్యాపారంలో దివాళా తీస్తే పొలాలు అమ్మి అప్పులు తీర్చి వుంటారు. వయసు దాటటంతో తన భర్తకి గవర్నమెంటు నౌకరి దొరకదు. అప్పుల్ని

## నాటకం



నాటకం చూసొస్తున్న మిత్రుడిని అడిగాడు జోగినాథం.

''ఆ నాటకం ఆఖరికి సుఖాంతమే అయిందా''

''ఆ...ఆ.. అందరూ సంతోషించారు ఆ నాటకం అంతం అయినందుకు''

–కె.వి.మధుసూధనరావు (కాకినాడ)

పోను మిగిలిన దాంతో వాళ్ళీ పట్నంలో వ్యాపారం మొదలుపెడతాడు. తన జీతంతో బ్రతుకు డోకా లేకుండా గడపవచ్చని ప్లాన్ వేసి వుంటుంది తన అత్త.

....

ఇదేది కాక వీళ్ళు తనమీద నిజంగా ప్రేమ ఒలకపోసినా ఆ ప్రేమ తనకి అక్కర్లేదు. అవివేకి చేతిలోని రాయి లాంటిది తన భర్త ప్రేమ. అందితే జుత్తు లేకపోతే కాళ్ళు అన్న నీచమైన మనస్తత్వం గల వాళ్ళతో తను సహ జీవనం చెయ్యలేదు. కుండెడు పాలని విరచటానికి ఒక్క వుప్పుగళ్లు చాలు. పాలలాంటి తన మనసు విరిగిపోయింది. ఆ మాటే నాన్నకి రాస్తాను. తెగించిన ఆడదని, పచ్చని సంసారం కాలదన్నుకున్న అవివేకి అని, అహంకారి అని అంతరంగం ఎవ్వనగ కూడా ఈ లోకం తనని నిందవెయ్యవచ్చు. తన తల్లి తండ్రి కూడా తనకి విరోధులు కావచ్చు.

అయినా ఫరవాలేదు.

ఈ లోకం అంతా ఒకవైపైనా సరే తను ఎదురుతిరిగి పోరాటం సాగిస్తుంది. డబ్బుతో ముడిపడే ప్రేమలు అనుబంధాలు తనకి అక్కరలేదు.

తన జీవితం తను బ్రతగ్గలదు.

బ్రతకలేని నాడు సంతోషంగా మరణిస్తుంది. అంతేగాని—


తనని ఇంటి నుంచి గెంటేసి, హీనంగా చూసిన వాళ్ళింటికి మాత్రం వెళ్ళదు. తనపై లేనిపోని నిందలు వేసి అభాండాలు సృష్టించిన వాళ్ళ గడప తను తొక్కదు. భార్య అందాన్ని ఆస్వాదించలేక అసూయతో శంకించిన తన భర్త లాంటి వ్యక్తితో తను జీవించలేదు. అవును. ఇదే తన నిర్ణయం.

నాన్నకి కచ్చితంగా తన అభిప్రాయం తెలుపుతాను... "అనుకుంటు ఆవేశంగా లేచి లెటర్ పాడ్ అందుకుని తండ్రికి ఉత్తరం రాయడం మొదలుపెట్టింది సవిత.

కాని అది 'ఉత్తరం' కాదు!

సవిస్తరంగా హృదయావేదనని విప్పిచెప్పే 'అవిత్తరం!'

రెండు జీవితాల్ని విడదీసే 'విడాకుల పత్తరం'



డిజైన్: ఆర్.తారాబాలకృష్ణ (హైదరాబాద్)